అనుమతి లేని వైద్యం.. ప్రాణాలతో చెలగాటం



ప్రథమ చికిత్సకు పరిమితం కావాల్సిన ఆర్ఎంపీలు, పీఎంపీలు వైద్య నిపుణుల్లా చలామణి అవుతూ అందిన కాడికి దండుకుంటున్నారు. దీనిపై దృష్టిసారించాల్సిన అధికారులు ఏదైనా అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు దాడుల పేరిట హడావుడి చేస్తున్నారు. అనంతరం మామూలుగా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొంతకాలం గ్రామీణ వైద్యులుగా చలామణి అయిన వారు ఏకంగా ఆసుపత్రులు, అంబులెన్సుల యజమానులుగా మారుతుండగా మరికొందరు ప్రైవేటు, కార్పొరేటు ఆసుపత్రులకు ఏజెంట్లుగా మారి అందినకాడికి దండుకుంటున్నారు.

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే

● పల్లెల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న కేంద్రాలు..



లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధి ఇటిక్యాల గ్రామానికి చెందిన డి.దీక్షిత(12) అనే బాలిక 15 రోజులుగా జ్వరం బారిన పడి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఈ నెల మొదటి వారంలో ఆమెకు జ్వరం వచ్చింది. ఆమెకు స్థానికంగా ఓ ఆర్ఎంపీ వారం రోజులపాటు చికిత్స అందించారు. రక్త కణాలు తగ్గి ఇబ్బందికరంగా మారడంతో కరీంనగర్ తరలించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. డెంగీకి సకాలంలో చికిత్స అందని కారణంగా బాలిక మృతి చెందినట్టు ఆసుపత్రి వైద్యులు చెప్పినట్టు సమాచారం.

అరకొర అనుభవంతో క్లినిక్‌లు

గతంలో మండలానికి అయిదారుగురు గ్రామీణ వైద్యులు ఉండేవారు. ప్రస్తుతం ఒక్కో మండలానికి కనీసం యాభై మందికిపైగా ఉన్నారు. జిల్లా మొత్తం మీద 1,500మంది వరకు గ్రామీణ వైద్యులు ఉన్నట్టు అంచనా. కరోనా తర్వాత ఎక్కడ చూసినా పుట్టగొడుగుల్లా వీరి క్లినిక్‌లు వెలిశాయి. ఒకటి రెండు సంవత్సరాలు ప్రైవేటు ఆసుపత్రుల్లో కాంపౌండర్లు, నర్సులుగా పని చేసిన అనుభవంతో సొంతగా క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. కనీస అర్హతలు లేకున్నా ఆసుపత్రుల్లో మందుల దుకాణాలు నడిపిన అనుభవంతో తెలిసీతెలియని వైద్యం చేస్తున్నారు.

అక్రమంగా పడకల ఏర్పాటు

గ్రామీణ వైద్యులు కేవలం ప్రాథమిక చికిత్స అందించాలి. సూది మందు ఇవ్వడానికి కూడా వారు అర్హులు కాదు. కానీ చాలా మంది ఆసుపత్రులు తెరిచి పడకలు ఏర్పాటు చేస్తున్నారు. మందుల దుకాణాలు నిర్వహించడం, రక్త మూత్ర పరీక్షలకు రాయడం విశేషం. కొందరు యూట్యూబుల్లో చూసి వైద్యం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వైద్యం వికటించిన సందర్భాల్లో తమకు తెలిసిన ప్రైవేటు, కార్పొరేటు ఆసుపత్రులకు తరలించి చేతులు దులుపుకొంటున్నారు. దీనికి కూడా తాము భాగస్వాములుగా ఉన్న అంబులెన్స్‌లో కార్పొరేటు ఆసుపత్రికి తరలించి డబ్బులు దండుకోవడంతోపాటు ఆసుపత్రి యాజమాన్యం నుంచి వైద్యానికి అయిన ఖర్చులో 40 శాతం వరకు కమీషన్లు తీసుకుంటున్నారనేది జగమెరిగిన సత్యం.



దండేపల్లి మండలం కొర్విచెల్మ గ్రామానికి చెందిన బత్తుల మధుకర్(26) అనే యువకుడికి ఆర్ఎంపీ చేసిన వైద్యం వికటించడంతో ఆయన మృత్యువాత పడ్డారు. జ్వరంతో బాధపడుతున్న ఆయనను పెద్దాసుపత్రికి తీసుకెళ్లకుండా తానే వైద్యం చేస్తానని నమ్మబలికి సెలైన్‌లో ఇంజక్షన్లు కలిపి ఇవ్వడంతో అది వికటించింది. హైదరాబాద్‌లోని కార్పొరేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ వారు బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించారు. ఈ వ్యక్తికే మంచిర్యాలలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స నిర్వహించడం దోపిడీకి అద్దం పడుతోంది.

దాడులు నిర్వహించి కట్టడి చేస్తాం

- బి.హరీశ్‌రాజ్, జిల్లా వైద్యాధికారి, మంచిర్యాల

నిబంధనల ప్రకారం గ్రామీణ వైద్యులు కేవలం ప్రథమ చికిత్స చేయడానికి మాత్రమే పరిమితం కావాల్సి ఉంటుంది. జిల్లాలో కొందరు తమ స్థాయికి మించి వైద్యులుగా చలామణి అవుతూ తెలిసీ తెలియని వైద్యం చేస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది. గతంలో పలుమార్లు వారిని పిలిపించి హెచ్చరించడం జరిగింది. విజిలెన్స్ దాడుల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి క్లినిక్ నడుపుతున్న వారిపై కేసులు కూడా నమోదు చేయడం జరిగింది. ఈ మధ్య కాలంలో జరిగిన కొన్ని ఘటనలపై శాఖాపరంగా విచారణ నిర్వహిస్తాం. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేస్తాం.

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు పత్రాల అందజేత


ఏసీసీ, న్యూస్‌టుడే: ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మంచిర్యాల పట్టణానికి సంబంధించి దరఖాస్తు చేసుకున్న ముగ్గురికి ట్రాన్స్‌జెండర్ గుర్తింపు పత్రాలను అందజేశారు. జిల్లా సంక్షేమశాఖాధికారి స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

నూనెలు సలసల.. పండగ ఎలా?

న్యూస్‌టుడే, రాంనగర్, ఇంద్రవెల్లి

తెలుగిళ్లలో పెద్ద పండగలు దసరా, దీపావళి, సంక్రాంతి వరుసగా రాబోతున్నాయి. సరిగ్గా ఈ సమయంలోనే నూనెలు, పప్పుల ధరలు అమాంతం పెరగడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. పండగలు అంటేనే.. సకినాలు, గారెలు, బూరెలు, అరిసెలు చేసుకోవడం ఆనవాయితీ. నగరాల్లో ఉండే వారు కూడా సెలవుల్లో ఇంటికి వస్తారు. వాళ్లకు ఇష్టమైనవి చేసి పెట్టాలని ఉంటుంది. నూనె సెగలతో కుటుంబాలపై అదనపు భారం పడుతోంది.

ఉమ్మడి జిల్లాలో ప్రతి నెల 40 లక్షల లీటర్ల నూనె వినియోగిస్తారు. నిరుపేదలతోపాటు హోటళ్లలో పామాయిల్ వినియోగం అధికంగా ఉంటుంది. ఇతర నూనెల ధరలతో పోలిస్తే లీటరుకు రూ.20-30 తక్కువగా ఉండటంతో వీటిని వినియోగిస్తారు. ఇటీవల ఆరోగ్యంపై శ్రద్ధతో బ్రౌన్ రైస్ నూనె, ఆలివ్ ఆయిల్, కొబ్బరినూనెల వినియోగం పెరిగింది. బ్రాండెడ్ పేరిట కొన్నింటిని లీటరు 200లకు పైగా విక్రయిస్తున్నారు.



ధరలను నియంత్రించాలి

అరుణ, గృహిణి, శాంతినగర్



పెరుగుతున్న ధరలను ప్రభుత్వం నియంత్రించాలి. ప్రభుత్వాలు పన్నులు పెంచిన ప్రతి సారి ఆ భారం నేరుగా ప్రజలపైనే వేస్తున్నారు. దిగుమతి సుంకం పెరిగితే కంపెనీలు 50 శాతం కూడా భరించకుండా నేరుగా ధరలు పెంచేసి వినియోగదారులపైనే భారం మోపడం ఎంత వరకు సమంజసం.

దిగుమతి సుంకం పెరగడంతోనే..

నూనెల ధరలు లీటరుకు సగటున రూ.20 పెరిగాయి. దిగుమతి సుంకం పెరగడంతోనే ధరలు పెరిగాయని నూనె వ్యాపారి సురేశ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నూనెలపై సుంకాన్ని భారీగా పెంచడంతో సంస్థలు ఆ భారాన్ని ప్రజలపైనే మోపాయని ఆయన పేర్కొన్నారు. ముడిసరకుగా దిగుమతి చేసుకునే వంట నూనెలకు(క్రూడ్ ఆయిల్) గతంలో 12.5 శాతం సుంకం ఉండేది. తాజాగా కేంద్ర ప్రభుత్వం దీన్ని 32.5 శాతానికి పెంచడంతో భారం పెరిగిపోయింది. ఒక్కో కుటుంబం సగటున అయిదు లీటర్ల నూనెను వినియోగిస్తారు. ఈ లెక్కన నెలకు కుటుంబంపై రూ.100 అదనంగా భారం పడుతోంది.



సామాన్యులపై భారమే

టేకం భీంబాయి, మొలలగుట్ట, ఇంద్రవెల్లి మండలం

ధరల పెరుగుదలతో సామాన్యులపై భారం పడుతోంది. గత నెల కంటే లీటరుకు రూ.20 నుంచి రూ.30 ధర పెరిగింది. సంతలో నాసిరకం కంపెనీల నూనె తీసుకొచ్చి అదే ధరతో విక్రయిస్తున్నారు. నూనెలు రేషన్ దుకాణాల్లో అందుబాటులో ఉంచి, రాయితీపై విక్రయిస్తే మాలాంటి పేదోళ్లకు కొంత మేలు జరుగుతుంది.

ప్రతిబింబం.. ప్రకృతి అందం



ప్రకృతి తన అందాలతో మన మనసులను ఇట్టే కట్టిపడేస్తుంది. అలాంటి చిత్రమే భీమారం మండల కేంద్రంలోని గొల్లవాగు జలాశయంలో బుధవారం కనిపించింది. ఈ చిత్రాన్ని చూసిన ప్రతి ఒక్కరికి ఆకాశంలోని మేఘాలు నేలను చేరి నీటిలో పడ్డాయా అన్నట్టు కనిపించింది. నీటిలో మబ్బులు, పక్కన్న ఉన్న చెట్లు, గుట్ట కనిపిస్తుండటం విశేషం.

- న్యూస్‌టుడే, భీమారం

28న జాతీయ లోక్ అదాలత్

మంచిర్యాల న్యాయవిభాగం, మంచిర్యాల నేరవిభాగం, ఏసీసీ: కేసుల సత్వర పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్ కక్షిదారులకు ఉపయోగపడుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28న జిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని మరో కార్యక్రమంలో రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

ప్రజాపాలనలో హామీలన్నీ నెరవేరుస్తాం : ఎంపీ

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ప్రజాపాలనలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. బుధవారం బెల్లంపల్లిలోని కాంటాచౌరస్తాలో రూ.7.58 కోట్లతో నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను ఎమ్మెల్యే గడ్డం వినోద్, జిల్లా పాలనాధికారి కుమార్ దీపక్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ మార్కెట్‌తో 150 కుటుంబాలకు ఉపాధి కలుగుతుందన్నారు. గడిచిన పదేళ్లలో భారాస హయాంలో రూ.7 లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పోడు భూములకు పట్టాలిచ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. మున్సిపల్ నుంచి కొత్త ఇంటి నంబర్లు ఇచ్చి త్వరలో విద్యుత్తు మీటర్లు బిగిస్తారని హామీ ఇచ్చారు. తన భార్యతోపాటు కూతురు వచ్చే నెలలో వచ్చి బెల్లంపల్లిలో ఉండి ప్రజలకు సేవ చేస్తారని పేర్కొన్నారు. అనంతరం కాల్‌టెక్స్‌లోని సబ్‌స్టేషన్‌లో రూ.98 లక్షలతో ఏర్పాటు చేసిన అదనపు నియంత్రికను ప్రారంభించారు. ఛైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ శ్రీనివాసరావు, ఆర్డీఓ హరికృష్ణ, ఏసీపీ రవికుమార్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



కూరగాయలు తక్కువకు ఇవ్వరా!

పట్టణంలో ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్‌ను బుధవారం ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్, జిల్లా పాలనాధికారి కుమార్ దీపక్ ప్రారంభించారు. స్టాల్స్ ప్రారంభం అయ్యాక కూరగాయల వ్యాపారుల వద్దకు వెళ్లి బెండకాయలు, టమాట ధరలు ఎలా ఉన్నాయంటూ బేరమాడారు. తక్కువ ఏం లేదా అంటూ చమత్కరించారు. ఎమ్మెల్యే బేరమాడుతుండగా ఎంపీతోపాటు పాలనాధికారి, ఛైర్‌పర్సన్ శ్వేత నవ్వులు చిందించారు.

- న్యూస్‌టుడే, బెల్లంపల్లి పట్టణం

సంపూర్ణ అక్షరాస్యతకు చర్యలు

ఏసీసీ: జిల్లాలో పూర్తి అక్షరాస్యత సాధనకు న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పలువురు అధికారులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కార్యక్రమం నిర్వహణపై చర్చించారు. జిల్లాలో గుర్తించిన నిరక్షరాస్యులను 100 శాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. అవసరమైన వాలంటీర్లను గుర్తించి ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. వయోజన విద్యాశాఖాధికారి పురుషోత్తం నాయక్, లీడ్ బ్యాంక్ అధికారి తిరుపతి, లయన్స్ క్లబ్ ప్రతినిధి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి.. ఆర్థిక ఉన్నతి

మంచిర్యాల గ్రామీణం, న్యూస్‌టుడే

ఇందిరా క్రాంతి పథం ఆధ్వర్యంలో మహిళలు స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహిస్తున్నారు. వీరు చిరు వ్యాపారాల్లో రాణించేందుకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు. పొదుపుతో పాటు తీసుకున్న రుణం సక్రమంగా చెల్లిస్తే మరో విడతలోనూ సొమ్ము అందిస్తున్నారు. పక్కా ప్రణాళికతో ఆర్థిక వెలుగులు సాధిస్తున్న మహిళలపై కథనం.



కుటుంబ పురోగతిలో భాగమై..

ఈమె పేరు చెన్న సత్యవతి. హాజీపూర్ మండలం చందనాపూర్. 2021లో సరస్వతి సహాయక సంఘంలో సభ్యురాలిగా చేరి ప్రతి నెలా పొదుపు చేస్తున్నారు. తొలిసారి బ్యాంకు నుంచి రూ.20 వేలు, స్త్రీనిధి నుంచి రూ.60 వేలు, వీవో నుంచి రూ.40 వేల రుణం తీసుకుని టైలరింగ్ దుకాణం ప్రారంభించారు. ప్రతి నెలా సక్రమంగా చెల్లించడంతో మండల సమాఖ్య నుంచి రూ.లక్ష అప్పుగా పొంది లేడీస్ ఎంపోరియం దుకాణం ఏర్పాటు చేసుకుని కుటుంబ పురోగతిలో భాగం పంచుకున్నారు. సమాఖ్య అధికారులు ఆమెను మరింత ప్రోత్సహించేందుకు రెండో విడతలో మరో రూ.2.10 లక్షల రుణం అందించారు. ఈ డబ్బులను వస్త్రాల దుకాణం కోసం వినియోగించి ఆర్థికంగా అభివృద్ధి చెందారు.

జిల్లాలోని స్వయం సహాయక సంఘాలు, సభ్యుల వివరాలు..

- మండలాలు : 16
- గ్రామ సంఘాలు : 468
- స్వయం సహాయక సంఘాలు : 10,167
- సభ్యులు : 1,14,611
- 2024-25లో బ్యాంకు లింకేజీ రుణాల లక్ష్యం : రూ. 430.28 కోట్లు
- 2024-25లో స్త్రీనిధి రుణాల లక్ష్యం : రూ. 38.93 కోట్లు

కూరగాయల వ్యాపారంతో..



ఈ చిత్రంలోని మహిళ మందమర్రి మండలం చిర్రకుంటకు చెందిన దర్శనాల విజయ. గాంధీ గ్రామ సంఘంలోని శ్రీవినాయక స్వయం సహాయక సంఘంలో సభ్యురాలు. 2022లో రూ.2 లక్షల బ్యాంకు రుణం తీసుకున్నారు. ఈ డబ్బులు పెట్టుబడిగా పెట్టి కూరగాయలు పండించి నిత్యం మందమర్రి మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. కూరగాయల వ్యాపారం ద్వారా నెలకు రూ.18 వేల వరకు సంపాదిస్తున్నట్లు సంతోషం వ్యక్తం చేశారు.

వ్యాపారాలు చేస్తూ...



ఈ చిత్రంలోని మహిళ బెల్లంపల్లి మండలం గురజాల గ్రామానికి చెందిన ఏదునూరి లక్ష్మి. 2006లో శ్రీలక్ష్మీసాయి పొదుపు సంఘంలో సభ్యురాలిగా చేరిన కొద్ది రోజులకు భర్త చనిపోయాడు. సంఘం ద్వారా చిన్న మొత్తంలో అప్పు తీసుకుని వాటిని తీరుస్తూ వ్యాపారాలు ప్రారంభించారు. కుండల తయారీ, జిరాక్స్, మ్యాచింగ్ సెంటర్ ఏర్పాటు, కెమెరా అద్దెకు ఇచ్చే వ్యాపారం చేపట్టారు. 2020లో రూ.లక్ష రుణం పొంది వస్త్ర దుకాణం ఏర్పాటు చేసి ప్రతి నెలా రూ.10 వేల ఆదాయం పొందుతూ ఆనందంగా జీవనం సాగిస్తున్నారు.

విద్యుత్తు కనెక్షన్ తొలగింపు


● ఆగ్రహంతో స్తంభం ధ్వంసం



శ్రీరాంపూర్‌లో ధ్వంసం చేసిన విద్యుత్తు స్తంభం

నస్పూర్, న్యూస్‌టుడే: విద్యుత్తు బిల్లులు చెల్లించని కారణంగా సిబ్బంది కనెక్షన్ కట్ చేయడంతో ఆగ్రహంతో ఓ ఇంటి యజమాని విద్యుత్తు స్తంభం ధ్వంసం చేసిన ఘటన శ్రీరాంపూర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అరుణాక్కర్ నగర్‌కు చెందిన ఆకుదారి వెంకటేష్‌కు చెందిన రెండు విద్యుత్తు మీటర్ల బకాయిలు రూ.8,682, రూ.4,362 కొన్ని నెలలుగా చెల్లించలేదు. దీంతో విద్యుత్తు సిబ్బంది బుధవారం ఉదయం విద్యుత్తు కనెక్షన్లు తొలగించారు. ఆయన ఆగ్రహంతో గొడ్డలితో విద్యుత్తు స్తంభాన్ని ధ్వంసం చేశారు. దీంతో విద్యుత్తుశాఖ ఏఈ రాంమూర్తి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. విద్యుత్తు స్తంభానికి మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు. అతడిపై శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని ఏఈ పేర్కొన్నారు.

సగం చెరువులు మాయం



ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే

ఉమ్మడి జిల్లాలో గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చేపట్టిన సర్వే వివరాల మేరకు 7,380 నీటివనరులుండగా వాటిలో 4,521 చెరువులను గుర్తించారు. ఈ పథకం ముగిసేలోపు 1,491 చెరువులను బాగు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. హైదరాబాద్‌లో చెరువుల ఆక్రమణలపై దృష్టి సారించిన ప్రభుత్వం తాజాగా జిల్లాలవారీగా చెరువుల రక్షణపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా చెరువుల సరిహద్దులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

◆ ఆదిలాబాద్ పట్టణ పరిధిలో 12 చెరువులు, కుంటలు కలిపి 518 ఎకరాల్లో విస్తరించి ఉండాలి. ఇందులో ఇప్పటికే వందల ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది. ఆదిలాబాద్ పట్టణం నడిబొడ్డున ఉన్న ఖానాపూర్ చెరువు 114 ఎకరాల్లో ఉండాలని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇది ఆక్రమణలకు గురై 60 ఎకరాలకు చేరింది. దీన్ని ట్యాంకుబండ్ మాదిరి చేయాలని గత ప్రభుత్వం రూ.4 కోట్లు మంజూరు చేసింది. చెరువు ఆక్రమణలకు గురికావడంతో పనులు పూర్తి చేయలేకపోయారు. పట్టణ పరిధిలోని మరో అయిదు చెరువులు అన్యాక్రాంతం అవుతున్నాయి. జిల్లాలో 119 చెరువుల జాడ లేకుండా ఉంది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా పాలనాధికారి సంబంధిత అధికారులతో కమిటీ వేశారు.

◆ మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలంలో నిజాం కాలంలో ఏడు చెరువులను గొలుసుకట్టుగా అభివృద్ధి చేశారు. దొనబండ వాగు మత్తడి నుంచి మొదలు ఇటిక్యాల చెరువు వరకు మధ్యలో అయిదు చెరువులు నిర్మించారు. కాలువల ద్వారా ఒకటి నిండగానే మరో చెరువుకు నీరందేలా చర్యలు తీసుకున్నారు. ఈ కాలువలు, చెరువు భూములు ఆక్రమణకు గురి అవుతున్నాయి. బెల్లంపల్లిలోని రైల్వే రడగం బాలబస్తీ జాతికుంట చెరువు 48 ఎకరాల్లో ఉండేది. అలాంటిది తాజా లెక్కల మేరకు తొమ్మిది ఎకరాలకే పరిమితం అయింది.

1,819 చెరువులు మాయం

ఉమ్మడి జిల్లాలో గత లెక్కలు, తాజా వివరాలతో పోలిస్తే 1,819 చెరువులు మాయమైనట్లు తెలుస్తోంది. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా గతంలో గ్రామాలవారీగా సర్వే నిర్వహించారు. అప్పటి లెక్కల మేరకు ఉమ్మడి జిల్లాలో 4,521 చెరువులు ఉండాలి. కానీ ప్రస్తుతం నీటి పారుదలశాఖ లెక్కల మేరకు 2,702 చెరువులు ఉన్నాయి. అందులోనూ వంద ఎకరాల్లో సాగు నీరందించేవి 668 ఉండగా మిగిలిన 2034 చెరువులు వంద ఎకరాలకుపైగా సాగు నీటిని అందిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో చెరువు భూములకు పట్టాలు పుట్టుకొచ్చాయనే ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలో 50 శాతం చెరువు భూములు కబ్జాలోనే ఉన్నాయి. రెవెన్యూ రికార్డుల ప్రకారం నీటిపారుదల, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే చేపడితే చెరువుల లెక్కలు తేలే అవకాశం ఉంది.

◆ నిర్మల్ పట్టణ పరిధిలోని చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. మంజులాపూర్ చెరువు 46.07 ఎకరాల్లో విస్తరించి ఉందని అధికారిక రికార్డులో ఉండగా పలువురు దర్జాగా కబ్జా చేస్తుండటంతో కొద్దిరోజుల్లో చెరువు కనుమరగయ్యేలా ఉంది. కంచరోని, ఇబ్రహీం, రాంసాగర్, గొల్లపేట, ధర్మసాగర్, కురన్నపేట, పల్లెచెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. జిల్లాల్లో ఇప్పటికే 358 చెరువులు మాయమైపోయాయి.



నిర్మల్ పట్టణం ఎన్టీఆర్ మార్గ్ భాగ్యనగర్ వద్ద కబ్జాకు గురవుతున్న మంజులాపూర్ చెరువు

ఉద్యోగ ధర్మాన్ని అంకితభావంతో నిర్వహించే అధికారులు కొందరైతే.. ప్రజల అవసరాలను గుర్తించి వారికి ఉపయోగపడే పనుల కోసం అహర్నిశలు పాటుపడే వారు మరికొందరు. ఆ కోవకే చెందుతారు ఈ నలుగురు ఐఏఎస్ అధికారులు. ఉట్నూరు ఐటీడీఏ పీవోలుగా విద్యా, వైద్యం, ఉపాధితో పాటు కనీస సదుపాయాలు వారికి అందేలా చేసి అడవిబిడ్డల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. వీరి సేవలను నిత్యం యాది చేసుకుంటూనే ఉన్నారు ఇక్కడి గిరి'జనం'. వారే ముత్యాల రాజు, జనార్దన్ నివాస్, ఆర్వీ కర్ణన్, వరుణ్‌రెడ్డి. -న్యూస్‌టుడే, ఉట్నూరు

వీరి చిత్తశుద్ధి.. కావాలి ఇతరులకు స్ఫూర్తి

● ఈ ఐఏఎస్‌ల కృషి చిరస్మరణీయం



ఉట్నూరు ఐటీడీఏ కార్యాలయం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేయాల్సిన బాధ్యత ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిపై ఉంది. ఐటీడీఏ స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకు అనేక మంది పీవోలు పని చేశారు. అందులో కొందరు ఉత్తమ సేవలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు. 1987 నుంచి 1990 వరకు మూడేళ్లపాటు ఐటీడీఏ పీవోగా పని చేసిన పి.సుబ్రహ్మణ్యం ఆదివాసీ హృదయాలను గెలిచారు. గోండి భాషను నేర్చుకొని వారికి చక్కటి సేవలందించారు. ఆ తరువాత రెండు దశాబ్దాల తర్వాత నలుగురు అధికారులు సేవలతో ప్రత్యేక గుర్తింపు పొందారు.

'నీ కోసం జీవిస్తే నీలోనే జీవిస్తావు జనం కోసం జీవిస్తే జనంలో నిలిచిపోతావు' - డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



సాంకేతికత ఈయన చొరవే



ఉట్నూర్-లాల్‌టెకిడిలోని ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాల



ముత్యాల రాజు

ముత్యాల రాజు ఐఏఎస్ ఆల్ ఇండియా టాపర్‌గా నిలిచిన ఈ అధికారి 31.03.2011 నుంచి 09.10.2012 వరకు ఇక్కడ పీవోగా పని చేశారు. పని తీరులో పారదర్శకత, నిర్ణయం తీసుకోవడంలో వేగం ఈయన సొంతం. పదో తరగతి పూర్తయ్యాక గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని గుర్తించి ఉట్నూరులో గురుకుల జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేశారు. సాంకేతిక విద్యా మండలితో మాట్లాడి ఉట్నూర్-లాల్‌టెకిడిలో ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాల నెలకొల్పడంలో సఫలీకృతులయ్యారు.

ప్రధాని మెచ్చిన అవ్వాల్ సేవలు



జనార్దన్ నివాస్

ఐటీడీఏ పీవోగా 2013 నుంచి 2014 వరకు పని చేసిన జనార్దన్ నివాస్ మారుమూల గిరిజనులకు మెరుగైన వైద్యమందించేందుకు విశేషంగా కృషి చేశారు. మాతా, శిశు మరణాలలో ఉమ్మడి ఆదిలాబాద్ దేశంలోనే మూడు, నాలుగు స్థానాలలో ఉండేది. ఈ గణాంకాలను చూసి దిగ్భ్రాంతికి గురైన పీవో జనార్దన్ నివాస్ గర్భిణులకు ఉచితంగా అంబులెన్స్ సేవలను అందించే అవ్వాల్(గోండి భాషలో అమ్మ) పేరుతో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టారు. ఐటీడీఏలో కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఎంతో గుర్తింపు పొందిన ఈ సేవలు కేంద్ర ప్రభుత్వాన్ని ఆకర్షించాయి. ప్రధాని మోదీ ఆయన సేవలను ప్రశంసించారు.



గర్భిణిని అంబులెన్స్‌లో తీసుకెళ్తూ..

'గిరి' దివ్యాంగులకు వికాసం



ఉట్నూరులో ఏర్పాటుచేసిన వికాసం పాఠశాల



ఆర్వీ కర్ణన్

మూడేళ్లు ఐటీడీఏ పీవోగా పని చేసిన ఆర్వీ కర్ణన్ విస్తృతంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ గిరిజనులతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఆదివాసీ, గిరిజన దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక బడి లేక వారు చదువులకు దూరమవుతున్నారని గుర్తించారు. ఛత్తీస్‌గఢ్‌లోని సక్షం పాఠశాలకు దీటుగా ఉట్నూరులో వికాసం ప్రత్యేక బాలల బడిని ఏర్పాటు చేశారు. అన్ని రకాల సౌకర్యాలు సమకూర్చారు. రాష్ట్రంలో తొలి గిరిజన దివ్యాంగ పాఠశాలగా ఈ బడి గుర్తింపు పొందింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ పాఠశాలకు ఇన్నోవేషన్ పురస్కారంతో సత్కరించింది.

అక్షర జ్యోతి.. యువతకు ఉపాధి

ఏడాది కాలం ఐటీడీఏ పీవోగా పని చేసిన వరుణ్‌రెడ్డి గిరిజన విద్యార్థుల చదువులపై ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. వారిలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు 'అక్షర జ్యోతి' కార్యక్రమం చేపట్టి విద్యార్థులు చదువుల్లో రాణించేలా ప్రతి వారం పరీక్షలు, సబ్జెక్టుల్లో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ మంచి ఫలితాలు సాధించేలా ప్రోత్సహించారు. ఇంజినీరింగ్, ఐఐటీ చదువుతున్న పేద విద్యార్థులకు ఐటీడీఏ ద్వారా ఉచితంగా ల్యాప్‌ట్యాప్‌లను అందజేశారు. గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారు.



గిరిజన విద్యార్థికి ల్యాప్‌ట్యాప్‌ను అందజేస్తున్న ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

మరో ముగ్గురు ఉపాధ్యాయులు..!

● ఆన్‌లైన్ పెట్టుబడుల వ్యవహారంలో అరెస్టు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో కలకలం సృష్టించిన యూబిట్ క్రిప్టోకరెన్సీ మోసం కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. విచారణలో భాగంగా ఇప్పటికే అయిదుగురిని రిమాండ్‌కు పంపిన పోలీసులు తాజాగా మరో ముగ్గురు ఉపాధ్యాయులను అరెస్టు చేశారు. వారిని బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఇందులో దాసరి రమేశ్ (కడెం మండలం కన్నాపూర్ పాఠశాల), కిరణ్ వెంకటేశ్ గౌడ్ (కుభీర్ మండలం దొడర్నా తండా పాఠశాల), బొమ్మిడి ధనుంజయ్ (ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం సొనాల పాఠశాల) ఉన్నారు.

ఖాతాల స్తంభన..

ఆన్‌లైన్ పెట్టుబడులతో అధిక రాబడులు వస్తాయని తప్పుడు వాగ్దానాలు చేస్తూ పెట్టుబడిదారులను ప్రలోభాలకు గురిచేస్తున్నారనేది ఈ కేసులో ప్రధాన ఆరోపణ. పిరమిడ్ తరహాలో ఈ పథకాన్ని విస్తరించడంలో స్టార్ గుర్తింపు ఉన్న సభ్యులు క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారని పోలీసులు గుర్తించారు. విచారణలో భాగంగా ఈ పథకంతో ముడిపడిఉన్న 11 బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. అనుమానం ఉన్న ఖాతాల్లో ఆర్థిక లావాదేవీలు పరిశీలిస్తూనే, ఆస్తుల గుర్తింపు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. అయితే.. కేసు దర్యాప్తులో భాగంగా నిధుల దుర్వినియోగం నిరోధం చేయడం, బాధితుల సొమ్మును భద్రత కల్పించేందుకు ఈ దశ కీలకంగా మారుతుందని పోలీసులు పేర్కొంటున్నారు.

రహస్య సమావేశాలు..

ఈ వ్యవహారంలో భాగస్వాములుగా ఉన్న వారంతా సభ్యులను ఆకర్షించేందుకు రహస్య సమావేశాలు నిర్వహించడం పరిపాటిగా మారింది. ఇదివరకు అరెస్టయిన వ్యక్తులతో సహా పలువురు కుట్రదారులు గత 8 నెలలుగా పలు చోట్ల రహస్యంగా సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఇందులో భాగంగా ఇప్పటికే నాలుగు వేర్వేరు చోట్ల వెల్లడైనట్లు విచారణలో వెల్లడైంది. ఓటీపీ ప్రయోజనాలను సైతం తమ ప్రచారంలో ఓ ప్రధాన ఆకర్షణగా ఉపయోగిస్తున్నారు. దీనివల్ల చాలామంది సులభంగా వీరి మాటలు నమ్మి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ ప్రయాణాలు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నాయని, మరింత సమాచారం సేకరించేందుకు అధికారులు సంబంధిత ఏజెన్సీలతో కలిసి ప్రయత్నాలు ముమ్మరం చేశామని పోలీసువర్గాలు చెబుతున్నాయి. కాగా.. మొత్తం వ్యవహారంలో ప్రధాన కుట్రదారు బ్రిజ్ మోహన్ సింగ్ అని గుర్తించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఇతనిపై ఇప్పటికే పలు కేసులు నమోదైనట్లు చెప్తున్నారు.

బాధితులు ముందుకురావాలి: జానకి షర్మిల, ఎస్పీ, నిర్మల్

విచారణ, దర్యాప్తు పూర్తి పారదర్శకంగా కొనసాగుతోంది. బాధితులు ముందుకొచ్చి వివరాలు అందజేస్తే రికవరీ ప్రక్రియ వేగవంతం చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. పోలీసులు సంప్రదించేవరకు చూడకుండా స్వచ్ఛందంగా ముందుకురావాలి. మోసపోయిన సొమ్మును రికవరీ చేసేందుకు, అసలైన యజమానులకు అప్పగించేందుకు చట్టపరమైన విధానాలు అవలంబిస్తున్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. యూబిట్‌కు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా నేరుగా తమను సంప్రదించాలి. దర్యాప్తు అధికారి అవినాశ్‌కుమార్ నేతృత్వంలో ప్రత్యేక బృందం విచారణ కొనసాగిస్తోంది.

సాధారణ వర్షపాతం.. సాగుకు ఊతం



నిండుకుండలా ఎల్లంపల్లి



దండేపల్లి శివారులో సాగవుతున్న వరి


నైరుతి రుతు పవనాలు రాష్ట్రం నుంచి నిష్క్రమించాయి. దీని ప్రభావంతో జూన్ రెండో వారం నుంచి ఇటీవలి వరకు వానలు కురిశాయి. సుమారు మూడున్నర నెలలపాటు కురిసిన వర్షం ఉమ్మడి జిల్లాలో సాధారణంగా ఉండగా నిర్మల్ జిల్లాలో మాత్రం సాధారణం కంటే ఒక శాతం ఎక్కువగా కురిసింది. ఆగస్టు రెండో వారం వరకు లోటు వర్షపాతం నెలకొన్నప్పటికీ ఆ తర్వాత తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలతో సగటున సాధారణ వర్షం నెలకొంది. జూన్ మొదటి వారంలో రాష్ట్రంలోకి నైరుతి ప్రవేశించగా జూన్ 15 నుంచి పూర్తి స్థాయిలో విస్తరించింది. సెప్టెంబరు 23 వరకు నిష్క్రమించాయి. ఈ సారి కురిసిన వానలతో జలాశయాలు, నీటి వనరుల్లోకి సమృద్ధిగా నీరు చేరడంతో సాగుకు ఊతమిచ్చింది. -న్యూస్‌టుడే, మంచిర్యాల వ్యవసాయం

జలాశయాలకు జలకళ

నైరుతితో కురిసిన వానలకు ఉమ్మడి జిల్లాలోని పలు జలాశయాలు, చెరువులు, ఇతర నీటి వనరులు జలకళను సంతరించుకున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని సాత్నాల, మత్తడి నిర్మల్ జిల్లాలోని కడెం, స్వర్ణ, శ్రీరాం సాగర్, సుద్దవాగు, మంచిర్యాల జిల్లాలోని ఎల్లంపల్లి, ర్యాలీ, గొల్లవాగు, నీల్వాయి, కుమురంభీం జిల్లాలోని పీపీ జలాశయం, అడ, వట్టివాగు తదితర జలాశయాల్లోకి భారీగా నీరు చేరడంతోపాటు చెరువులు, వాగులు, ఇతర నీటి వనరులన్నీ జలకళను సంతరించుకున్నాయి. ఇవి పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకున్నాయి.

పచ్చని పంటలతో కళకళ..

నీటి వనరుల్లోకి సమృద్ధిగా నీరు చేరడంతో సాగు ఇబ్బందులు తొలగాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో పత్తి, సోయాబీన్, మిగతా మూడు జిల్లాల్లో పత్తి, వరి పంటలు ప్రధానంగా సాగవుతున్నాయి. పప్పుదినుసులు, మొక్కజొన్న కొంత మేర సాగు చేస్తున్నారు.



ఆదిలాబాద్ జిల్లాలో ఏడు శాతం అధికం



నైరుతి ప్రభావంతో ఆదిలాబాద్ జిల్లాలో వానాకాలం సీజన్‌లో సాధారణ వర్షపాతం 969.7 మిల్లీమీటర్లుకాగా 1041. మి.మీ నమోదైంది. ఇంద్రవెల్లి, గుడిహత్నూరు, ఆదిలాబాద్ గ్రామీణం, అర్బన్, తాంసి మండలాల్లో అధిక వర్షపాతం నమోదుకాగా మిగతా మండలాల్లో సాధారణం కంటే 20 శాతం తక్కువగా నమోదైంది.

మంచిర్యాల జిల్లాలోని మూడు మండలాల్లో ..



మంచిర్యాల జిల్లాలోని కాసిపేట, కన్నెపల్లి, కోటపల్లి మండలాల్లో 20 శాతానికి మించి మిగులు వర్షపాతం నమోదుకాగా మిగతా 15 మండలాల్లో సాధారణ వర్షపాతం నెలకొంది. సీజన్‌లో సాధారణ వర్షపాతం 913.0 మి.మీకాగా 967.3 మి.మీ నమోదైంది. ఆరు శాతం అధికంగా ఉంది.

కుమురంభీంలో 14 శాతం..



కుమురంభీం జిల్లాలో 14 శాతం అధికంగా నమోదైంది. జైనూర్, వాంకిడి, కౌటాల, చింతలమానెపల్లి, పెంచికల్‌పేటలో మిగులు వర్షపాతం నమోదుకాగా మిగతా మండలాల్లో సాధారణం నెలకొంది. సాధారణం 999.6 మి.మీకాగా 1144.4 మి.మీ అంటే 14 శాతం అధికంగా నమోదైంది..

నిర్మల్ జిల్లాలో ఇలా..



ఉమ్మడి జిల్లాలోని 19 మండలాలకు పది మండలాల్లో అధిక వర్షపాతం నమోదుకాగా కుభీరు, తానూరు, భైంసా, కుంటాల, నర్సాపూర్-జి, సారంగాపూర్, సోన్, ఖానాపూర్, దస్తూరాబాద్ మండలాల్లో సాధారణం నెలకొంది. సాధారణం 881.8 మి.మీకాగా 1061.7 మి.మీ అంటే 20 శాతం అధికంగా నమోదైంది.

యజమాని లేకున్నా ఇంటికి చేరుకుంటాం



పంట సాగులో తోడుగా నిలిచే ఎడ్లు తమ యజమాని వెంట లేకపోయినా ఎడ్లబండిని ఇంటికి తీసుకెళ్లడం విశేషం. యజమాని ఇంటికి వెళ్లే దారి అలవాటు ఉండటంతో తోడుగా రైతు లేకుండానే నేరుగా ఇంటికి వెళ్తున్నాయి. ఇంద్రవెల్లి మండలం సమాక పంచాయతీ పరిధిలోని పాటగూడ గ్రామానికి చెందిన రైతు కుర్ర రాజేశ్వర్‌కు ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని పోతగూడ గ్రామ శివారులో సాగు భూమి ఉంది. సాయంకాలం సమయంలో రైతు ఎడ్లబండిపై పచ్చి గడ్డిని వేసి, బండి వెనకాల లేగదూడను కట్టి చేలో రోజంతా పని చేసిన ఎడ్లను ఇంటి దారి పట్టించారు. మూడు కి.మీ దూరంలోని యజమాని ఇంటికి వెళ్తూ.. అడ్డువచ్చిన వాహనాలను తప్పించుకుంటూ ఇలా వెళ్తున్న చిత్రాలను బుధవారం 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. **- న్యూస్‌టుడే, ఇంద్రవెల్లి**

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

● పట్టుబడ్డ సరకు విలువ రూ.2.25 కోట్లు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

తలమడుగు, న్యూస్‌టుడే : తలమడుగు మండలం లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద బుధవారం 292 ప్యాకెట్లలోని 9 క్వింటాళ్ల గంజాయి, కంటైనర్‌ను పోలీసులు పట్టుకున్నట్లు ఎస్పీ గౌష్ ఆలం వెల్లడించారు. సరకు విలువ రూ.2.25 కోట్లు ఉంటుందన్నారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు అటవీ ప్రాంతం నుంచి వరంగల్, కరీంనగర్ మీదుగా తెలంగాణ, మహారాష్ట్రలతో పాటు ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను పట్టుకున్నట్లు వివరించారు. ఇద్దరిని అరెస్టు చేసి 8 మందిపై కేసు నమోదు చేశామన్నారు. తలమడుగు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఆంధ్రా, ఒడిశా నుంచి పెద్ద ఎత్తున గంజాయి తరలుతోందని ముందస్తు సమాచారంతో ఉదయం అంత్రరాష్ట్ర రహదారి లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేపట్టారు. ఉత్తరాఖండ్‌కు చెందిన ఐచర్ కంటైనర్ వాహనం ఆదిలాబాద్ పట్టణం వైపు నుంచి మహారాష్ట్ర వెళ్తోంది. ఈ క్రమంలో వాహనాన్ని చెక్‌పోస్టు సమీపంలో తనిఖీ చేయగా అందులో 9 క్వింటాళ్ల గంజాయిని, డ్రైవర్ వసీం, క్లీనర్ అర్మాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు ఉత్తరాఖండ్ హరిద్వార్‌కు చెందిన అన్సుజైన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన పండిత్, సోను అన్సారి గంజాయి వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్, సుక్మా జగదల్‌పూర్ జిల్లాల అటవీ ప్రాంతం నుంచి గంజాయిని పైన పేర్కొన్న ముగ్గురికి డ్రైవర్, క్లీనర్‌లు సరఫరా చేస్తున్నారని వివరించారు. ఆంధ్రా - ఒడిశా అటవీ ప్రాంతంలో 900 కిలోల గంజాయి ఉందని దానిని మహారాష్ట్రలోని బుల్దానా, దూలే జిల్లాలకు తరలించేందుకు వారు రూ.1,50,000 ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆదిలాబాద్ నుంచి తలమడుగు మండలం మీదుగా మహారాష్ట్ర వెళ్తుండగా పక్కా ప్రణాళికతో పట్టుకున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంత పెద్ద మొత్తంలో గంజాయి పట్టుబడటం ఇదే మొదటిసారన్నారు. అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ సురేందర్‌రెడ్డి, గ్రామీణ సీఐ ఫణిందర్‌ను ఎస్పీ అభినందించారు. వారితో పాటు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, జైనథ్ సీఐడి సాయినాథ్, ఎస్సైలు అంజమ్మ, ముజాహిద్, విష్ణువర్ధన్‌లను అభినందించి నగదు బహుమతి అందించారు.

పట్టు తప్పినా వదల్లేదు!



చేప దొరికిందోచ్..



నోటిలో నుంచి జారిపోతూ..



చివరకు గుటుక్కున మింగేసి..

ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం మత్తడివాగు జలాశయంలో నీటి కొంగ ఓ చేపను పట్టుకుంది. ఆ చేప నోటిలోంచి జారిపోతున్నా.. ఒడుపుగా నోటితో కరిచి పట్టుకుంది. అయినా ఆ చేప పట్టు విడిపించుకునేందుకు తీవ్ర ప్రయత్నం చేసింది. ఇంతలో ఆ చేప ఎక్కడ జారిపోతుందో అని ఒక్కసారిగా గాల్లోకి ఎగిరేసి గుటుక్కున మింగేసింది. జలాశయాన్ని చూడటానికి వచ్చిన పర్యాటకులు ఈ దృశ్యం చూసి ఆశ్చర్యపోయారు. - ఈనాడు, ఆదిలాబాద్ - న్యూస్‌టుడే, తాంసి

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



ఉమ్మడి జిల్లా మహిళల జట్టు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాల వద్ద బుధవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు రసవత్తరంగా సాగాయి. ఉమ్మడి ఆదిలాబాద్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ మహిళలు, పురుషులకు నిర్వహించిన పోటీల్లో 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్ రహీం, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్‌లు క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. పురుషులు, మహిళలు నాలుగేసి జట్ల చొప్పున ఆడించారు. మహిళలు, పురుషులు రెండు విభాగాల నుంచి 21 మంది క్రీడాకారుల చొప్పున ఎంపిక చేశారు. వీరికి ఏడు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించి టీంకు అవసరమయ్యే 16 మంది చొప్పున రెండు టీంలను ఎంపిక చేస్తారని చెప్పారు. ఆ రెండు జట్లు అక్టోబర్ 9-11 వరకు రంగారెడ్డి జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆడుతారని వివరించారు. కార్యక్రమంలో క్రీడా పాఠశాల హెచ్‌ఎం జంగు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సట్ల శంకర్, గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, సాఫ్ట్‌బేస్ బాల్ కార్యదర్శి గురవేందర్, హ్యాండ్ బాల్ నేషనల్ రెఫరీ కళ్యాణ్, శిక్షకులు అరవింద్, రాకేష్, రవి, పీడీ, పీఈటీలు గౌరి, హారిక, చిన్నక్క, యాదగిరి, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం



సేంద్రియ కషాయాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ సంధ్యారాణి

ఉట్నూరు, న్యూస్‌టుడే : తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ వ్యవసాయ సహాయ సంచాలకురాలు సంధ్యారాణి అన్నారు. బుధవారం ఉట్నూరు ఐటీడీఏలోని ఉద్యాన నర్సరీని పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ విధానం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. గిరిజన రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి సేద్య పద్ధతిలో పండించే పంటల దిగుబడి గురించి ఆరా తీశారు. పీహెచ్‌ఓ సందీప్ కుమార్, హెచ్‌ఓ సుధీర్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే:

? ఆంధ్రాబ్యాంకు వీధిలో రోడ్ల పక్కనే ద్విచక్రవాహనాలు గంటల తరబడి నిలిపి ఉంచడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. **- రమేష్, బజారేరియా**

✔ ఆంధ్రాబ్యాంకు గల్లీలో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. రోడ్లపైన ద్విచక్రవాహనాలు నిలిపితే జరిమానాలు విధించి కేసులు నమోదు చేస్తాం. **- దేవయ్య, ఒకటో పట్టణ ఎస్‌హెచ్‌ఓ**

? కాల్‌టెక్స్‌లో ప్రధాన మురుగుకాల్వలు నిండిపోయి దుర్గంధం వెదజల్లుతుంది. **- గంగారాం, కాల్‌టెక్స్**

✔ మురుగుకాల్వల్లో వ్యర్థ వస్తువులు వేస్తే జరిమానాలు విధిస్తాం. మురుగుకాల్వలను తప్పకుండా శుభ్రం చేస్తాం. **- వైకుంఠం, పారిశుద్ధ్య అధికారి**

రైలు కింద పడి వివాహిత బలవన్మరణం

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే: పట్టణంలోని రైల్వే ఓవర్‌బ్రిడ్జి వంతెన సమీపంలో బుధవారం రాత్రి స్థానిక భగవంతంవాడకు చెందిన కొండపల్లి సంగీత(30) రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. భార్యాభర్తలైన కొండపల్లి రమేష్, సంగీతల మధ్య కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం వీరి ఇద్దరి మధ్య తలెత్తిన వివాదంతో మనస్తాపానికి గురైన సంగీత తొందరపాటు నిర్ణయంతో బలవన్మరణం పొందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపారు.

మరో ఘటనలో యువకుడు..

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే: మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో మంగళవారం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న యువకుడి ఆచూకీ లభ్యమైనట్లు జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపారు. మృతుడు మందమర్రికి చెందిన బండి సాయితేజ(20)గా గుర్తించామని పేర్కొన్నారు. బీటెక్ చదువుతున్న సాయితేజను బాగా చదవు కోవాలని మందలించినందుకు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


సాయితేజ

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

హాజీపూర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం కుమురంభీం జిల్లా వాంకిడి మండలం సోయం గూడ వెలిగొండలకు చెందిన ఆస్రం జ్యోతిరావు, భీలాడీ గూడకు చెందిన కోవ శేఖర్లు ద్విచక్రవాహనంపై మంచిర్యాల నుంచి లక్సెట్టిపేట వైపునకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో హాజీపూర్ మండల కేంద్రంలోని నర్సరీ సమీపంలో ఎదురుగా లక్సెట్టిపేట నుంచి మంచిర్యాల వైపునకు వస్తున్న కంకర లారీ అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న జ్యోతిరావు(41) అక్కడికక్కడే మృతి చెందగా, కోవ శేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు హాజీపూర్ పోలీసులు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ప్రమాదానికి కారణమైన లారీపై కేసు నమోదు చేసినట్లు సమాచారం.

రైల్వే ఫ్లాట్‌ఫాంపై నుంచి పడి ఒకరికి గాయాలు

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే: మంచిర్యాల రైల్వేస్టేషన్‌లోని రెండవ ఫ్లాట్‌ఫాం నుంచి కిందపడి బుధవారం గుర్తుతెలియని వ్యక్తి గాయాలపాలైనట్లు జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపారు. క్షతగాత్రుడు 60 సంవత్సరాల వయసు ఉంటుందని, ప్రమాదం జరిగిన 108లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నట్లు పేర్కొన్నారు.

నలుగురికి జైలు శిక్ష

జన్నారం, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో జన్నారం మండలానికి చెందిన నలుగురికి ఆరు నెలల జైలు శిక్ష రూ.4 వేల జరిమానా విధిస్తూ ఆదిలాబాద్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డా.పి.శివరాం ప్రసాద్ తీర్పు ఇచ్చినట్లు జన్నారం ఎస్సై జి.రాజవర్ధన్ తెలిపారు. జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలో 16.05.2020లో పొట్ల అన్వేష్ అనే యువకుడిని హరీశ్‌కుమార్‌గౌడ్, ముత్యం సాయి, పొట్టూరి ప్రశాంత్, మహ్మద్ ఆజ్మత్ ఖాన్ అనే నలుగురు కలిసి చేతులు, బెల్టు, కర్రలతో కొట్టి గాయపరిచి కులం పేరుతో దూషించి చంపుతామని బెదిరించడమే కాకుండా మూత్రం తాగించి హింసించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై వినోద్ కుమార్ కేసు నమోదు చేయగా అప్పటి జైపూర్ ఏసీపీ జి.నరేందర్ కేసు దర్యాప్తు చేశారు. పైన తెలిపిన నలుగురిపై సెక్షన్ 323, 324, 290, 506 రెడ్ విత్ 341ఐపీసీ, సెక్షన్ 3(1)(ఎస్) అండ్ 3(2)(వీఏ) ఎస్సీ, ఎస్టీ చట్టంలో దరఖాస్తు నివేదికను కోర్టులో దాఖలు చేశారు. మంచిర్యాల కోర్టు లైజన్ అధికారి సయ్యద్ తాజోద్దీన్, సీడీఓ ఐప్రాహ్ అహ్మద్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముష్కు రమణారెడ్డి 17 మంది సాక్షులను విచారించి నేరం రుజువు చేయగా న్యాయమూర్తి పైన తెలిపిన నలుగురికి ఒక్కొక్కరికి ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ.4 వేల చొప్పున జరిమానా విధించారు. నిందితులకు శిక్ష విధించడంలో కృషి చేసిన జన్నారం ఎస్సై జి.రాజవర్ధన్, లక్సెట్టిపేట సీఐ ఎ.నరేందర్, కోర్టు విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారులను రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్ అభినందించారు.

మహిళ నుంచి డబ్బులు లాక్కున్న వ్యక్తికి రిమాండ్

జన్నారం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు నుంచి రూ.10 వేలను ఓ మహిళ మంగళవారం డ్రా చేసుకొని వెళుతుండగా వాటిని లాక్కొని పారిపోయిన వ్యక్తిని 24 గంటల్లో పట్టుకొని రిమాండ్‌కు పంపించినట్లు జన్నారం ఎస్సై జి.రాజవర్ధన్ తెలిపారు. చింతగూడ గ్రామానికి చెందిన ముదేళ్ల భూమక్క బ్యాంక్ నుంచి డబ్బులు తీసుకొని బయట నిలబడి ఉండగా ఖమ్మం జిల్లా మధిర మండలానికి(ప్రస్తుత నివాసం నిర్మల్) చెందిన కంభంపాటి యేసోబ్ అలియాస్ అంగందుల సురేశ్‌రెడ్డి అనే వ్యక్తి డబ్బులు లాక్కొని వెళ్లాడు. ఈ మేరకు బుధవారం అతడిని పట్టుకొని దొంగిలించిన సొమ్ము రికవరీ చేసి రిమాండ్‌కు పంపించినట్లుగా పేర్కొన్నారు. కానిస్టేబుళ్లు తుకారాం, భాస్కర్‌ను ఎస్సై, సీఐ అభినందించారు.

రహదారి విస్తరణకు ఆటంకం

మంచిర్యాలలోని హమాలివాడలో రహదారి పరిధిలోని విద్యుత్తు నియంత్రిక తొలగించకుండానే బీటీ రహదారి నిర్మిస్తున్నారు. అక్కడ రహదారి ఇరుకుగా మారి భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్య ఏర్పడే అవకాశం ఉంది. అక్కడ దాదాపు రూ.5 కోట్లతో రహదారిని విస్తరణ పనులు చేస్తున్నారు. 60 అడుగుల వెడల్పు నిర్మించాల్సిన రహదారిలో చాలా ఇళ్లు తొలగించాల్సి వస్తుందని 55 అడుగులకు కుదించారు. అయినా రహదారి విస్తరణలో ఇప్పటికే అనేక ఇళ్లు, గోడలు కూల్చి వేశారు. గుత్తేదారు చేపట్టిన పనులు పూర్తి కాకముందే రహదారి విస్తరణకు అడ్డంగా ఉన్న విద్యుత్తు నియంత్రిక తొలగించాలని ఆ కాలనీ ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, మంచిర్యాల పట్టణం


హమాలివాడలో రహదారి విస్తరణకు అడ్డుగా ఉన్న విద్యుత్తు నియంత్రిక

రాకపోకలకు నరకయాతన



చెన్నూరు మండలంలోని కొమ్మెరలో పంటపొలాలకు వెళ్లే దారి నరకాన్ని తలపించేలా మారింది. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం సమీపం పక్క నుంచి పొలాలకు వెళ్లేందుకు మట్టిరోడ్డు ఉంది. వర్షంపడితే ఎడ్ల బండ్లు కూడా వెళ్లేందుకు కష్టాలు తప్పడం లేదు. బురదగా మారిన రహదారిపై రైతులు అతికష్టం మీద రాకపోకలు సాగిస్తున్నారు. వైకుంఠధామానికి వెళ్లే మార్గం కూడా ఇదే కావడంతో చివరి మజిలీకి ఇబ్బందులు తప్పడం లేదు. పాలకులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, చెన్నూరు గ్రామీణం

పండగకు పస్తులుండాల్సిందేనా..!

అటవీశాఖ మహిళా ఉద్యోగి ఆవేదన

జన్నారం, న్యూస్‌టుడే: సద్దుల బతుకమ్మ, దసరా పండగలకు తాను, తన కుటుంబ సభ్యులు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందని జన్నారం అటవీ డివిజన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న సవిత ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్ కార్యాలయ ఆవరణలో బుధవారం తన గోడును విలేకరుల ముందు వెల్లబోసుకున్నారు. ఈ ఏడాది ఆగస్టు 1న తాను జన్నారం అటవీ డివిజన్ కార్యాలయానికి సాధారణ బదిలీల్లో భాగంగా వచ్చినట్లు చెప్పారు. ఆ నెలకు సంబంధించిన వేతనాన్ని తీసుకున్నానని సెప్టెంబరు నెలకు సంబంధించిన వేతన బిల్లు చేయకుండా ఇదే కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్, ఇన్‌ఛార్జి అడ్మినిస్ట్రేటివ్ అధికారి సమీమొద్దిన్ నిలుపుదల చేశారని పేర్కొన్నారు. సీనియార్టీలో తన కంటే జూనియర్ అయిన సమీమొద్దిన్ 15 సంవత్సరాల నుంచి డిప్యూటేషన్ మీద ఇక్కడే పని చేస్తూ కిందిస్థాయి సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తాను పని చేస్తున్న గది వద్ద అటెండర్‌ను సైతం ఇవ్వలేదన్నారు. జన్నారం ఇన్‌ఛార్జి ఎఫ్‌డీఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ప్రస్తుత మంచిర్యాల డీఎఫ్‌ఓ తన గోడు చెప్పుకునే అవకాశం ఇవ్వడం లేదన్నారు. ఈ విషయమై మంచిర్యాల డీఎఫ్‌ఓ శివ్ ఆశిష్‌సింగ్‌ను 'న్యూస్‌టుడే' చరవాణిలో సంప్రదించగా సవిత అనే సీనియర్ అసిస్టెంట్ మరో కార్యాలయంలో పని చేయడంతో సెప్టెంబరు నెలకు సంబంధించిన వేతన బిల్లును జన్నారంలో చేయడం లేదని సమాధానం ఇచ్చారు. అధికార దుర్వినియోగానికి పాల్పడితే ఎంతటి వారినైనా క్షమించేది లేదని డీఎఫ్‌ఓ చెప్పారు.



తాను పని చేస్తున్నట్లు దస్త్రాలు చూపిస్తున్న సవిత

పొగాకు ఉత్పత్తులతో అనర్థం

హాజీపూర్, న్యూస్‌టుడే: జాతీయ పొగాకు వ్యతిరేక ఉద్యమంలో భాగంగా బుధవారం హాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీహెచ్‌వో లింగారెడ్డి మాట్లాడుతూ సిగరెట్లు, బీడీలు, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులను వినియోగించడంతో క్యాన్సర్‌కు గురవుతున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులో పొగాకు వినియోగించకుండా ప్రతిజ్ఞ చేయించారు.

హెచ్‌ఐవీపై కళాజాత

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే: హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై 'దిశ' అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యశాఖ, ఆయా విభాగం అధికారులు బుధవారం జిల్లా కేంద్రంలో కళాజాత ఏర్పాటు చేశారు. పట్టణ పుర వీధుల్లో కళాకారుల బృందం స్థానికులకు సంబంధిత అంశంపై పాటల రూపంలో అవగాహన కల్పిస్తూ ఆకట్టుకున్నారు. ప్రచారపత్రాలు ప్రదర్శిస్తూ ఆయా వ్యాధులపై వివరించారు. మంచిర్యాల, బెల్లంపల్లి ఉప వైద్యాధికారులు అనిత, సుధాకర్‌నాయక్, వైద్యాధికారి శివప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


కళాజాతలో భాగంగా ప్రచారప్రతులను ప్రదర్శిస్తున్న వైద్యసిబ్బంది, జనజాగృతి కళాకారులు

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి

హాజీపూర్, చెన్నూరు పట్టణం, మంచిర్యాల సిటీ, రామకృష్ణాపూర్, తాండూరు, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా భాజపా ఆధ్వర్యంలో జనసంఘ్ వ్యవస్థాపకుడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బుధవారం ఆ పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన దేశానికి చేసిన సేవలను వివరించారు. వెరబెల్లి రఘునాథ్, అశ్విన్‌రెడ్డి, జాడి తిరుపతి, వేముల అశోక్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి పాల్గొన్నారు.


చెన్నూరులోని పార్టీ కార్యాలయంలో..


ఆర్కేపీలో..


ఐబీలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న భాజపా నాయకులు

ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ

ఏసీసీ, న్యూస్‌టుడే: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పోషణ సంక్షేమ నియమావళి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత ప్రచారపత్రాలను విడుదల చేశారు. 26న వృద్ధాశ్రమాలు, డేకేర్ సెంటర్లలో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, 27 పట్టణంలోని రైల్వే వంతెన నుంచి ముఖరాం చౌరస్తా వరకు ర్యాలీ, 28, 30న తల్లిదండ్రుల పోషణ చట్టం, ఆరోగ్యం సంరక్షణపై అవగాహన సదస్సు, 29న అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో గ్రాండ్ పేరెంట్స్ డేలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా సంక్షేమశాఖాధికారి స్వరూపారాణి, సౌజన్య ఉన్నారు.

ఉద్యోగ మేళాకు భారీ స్పందన

మంచిర్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో డీఆర్డీఏ ఈజీఎంఎం, మేజిక్ బస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉద్యోగమేళాకు వివిధ ప్రాంతాల నుంచి భారీ ఎత్తున నిరుద్యోగ యువత హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి కిషన్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కోసం ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేళాలో 374 మంది హాజరుకాగా మెడ్‌ప్లస్‌లో ఎనిమిది, హెల్త్‌కేర్‌లో 21, యాక్సిస్‌బ్యాంక్‌లో ఆరుగురు, అపోలో ఫార్మసీలో ఆరుగురు మొత్తం 86 మందిని ఆయా కంపెనీల ప్రతినిధులు ఎంపిక చేసుకున్నారు. ఏవో రాజేష్, డీపీఎంలు స్వర్ణలత, వేణు, జేడీఎం రాంచందర్, ఫౌండేషన్ ప్రతినిధి తిరుపతి, శిక్షకులు స్వర్ణలత, గురువయ్య పాల్గొన్నారు.


ఉద్యోగమేళాకు హాజరైన యువతితో మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి కిషన్


సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి రవి

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

చెన్నూరు, న్యూస్‌టుడే: చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, చెన్నూరు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి రవి సూచించారు. బుధవారం పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాలికల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. రమేశ్‌చందర్‌గిల్డా, శ్వేత, రాంభావ్, మహేశ్, రమశ్, పున్నం, రాజేశ్ పాల్గొన్నారు.

వాస్తవ లాభాలు ప్రకటించాలని వినతి

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: సింగరేణి సంస్థకు గత ఆర్థిక సంవత్సరం వచ్చిన వాస్తవ లాభం రూ.4,701 కోట్ల నుంచి 33 శాతం కార్మికులు పంపిణీ చేయాలని తెబొగకాసం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మందమర్రి జీఎం కార్యాలయం ముందు తెబొగకాసం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, ఏరియా ఎస్‌ఓటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, జే.రవిందర్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

శ్రీరాంపూర్ గ్రామీణం : సింగరేణి సాధించిన వాస్తవ లాభాల నుంచి 33 శాతం వాటా కార్మికులకు చెల్లించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బుధవారం జీఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఎస్‌ఓటు జీఎం ఎన్.సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. రమేష్, భాస్కర్, సంతోష్, వికాస్, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

ఈపీ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి కృషి

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: బొగ్గు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న ఈపీ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం ముందుకు రావాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శులు వైవీ రావు, కె.వీరభద్రయ్య డిమాండ్ చేశారు. బుధవారం శ్రీరాంపూర్ ఉపరితల గని వద్ద మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా వీరికి పదోన్నతులు కల్పించాలన్నారు. రామచందర్, చంద్రమోహన్, పిట్ కార్యదర్శి లచ్చన్న, బుచ్చయ్య, అఫ్రోజ్‌ఖాన్, సుధాకర్ పాల్గొన్నారు.



సింగరేణిలో పెరిగిన రాజకీయ జోక్యం

నస్పూర్, న్యూస్‌టుడే: సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని, ఫలితంగా కార్మికులకు లాభాల వాటా పంపిణీలో అన్యాయం జరిగిందని భాజపా జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ పేర్కొన్నారు. బుధవారం నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణి లాభం రూ.4,701 కోట్లురాగా 33 శాతం అంటే కార్మికులకు రూ.1,551 కోట్లు ఇవ్వాల్సి ఉండగా ప్రభుత్వం కేవలం రూ.796 కోట్లు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్న రూ.33 వేల కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీల్లో భాగంగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గోదావరిఖని పర్యటనలో సింగరేణి నిధులు రూ.కోటి రూపాయలు ఖర్చు చేశారని ఆరోపించారు. నాయకులు సదానందం, అశ్విన్ రెడ్డి, బింగి ప్రవీణ్, మొగిళి, విక్రమ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


నస్పూర్‌లో మాట్లాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

బతుకమ్మ చీరల పంపిణీ

దండేపల్లి గ్రామీణం: బతుకమ్మ కానుకగా కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ఆధ్వర్యంలో దండేపల్లి మండలం లక్ష్మీకాంతాపూర్, పెద్దపేట, ధర్మరావుపేట, ద్వారక, కొండాపూర్, కాసిపేట, వెల్గనూర్ గ్రామాల్లో బుధవారం మహిళలకు ఎమ్మెల్యే సోదరీమణులు రుక్మిణీ, సత్యశ్రీ చీరలను పంపిణీ చేశారు. లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ అధ్యక్షుడు దాసరి ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణాలు శుభ్రం చేయాలని వినతి

రామకృష్ణాపూర్: మందమర్రి పుర పరిధిలోని వార్డుల్లో ఏర్పాటు చేసిన బతుకమ్మ ప్రాంగణాలను శుభ్రం చేయాలని స్థానికులు బుధవారం పుర కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ప్రాంగణాల వద్ద విద్యుత్తు దీపాలు అమర్చాలని కోరారు.

కుక్కలను హతమార్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

చెన్నూరు: చెన్నూరు పట్టణంలో వీధికుక్కలను చంపించిన ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సుశీల్‌కుమార్ బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూగజీవాలను కిరాతకంగా చంపడం చట్టరీత్యా నేరమైనందున తక్షణం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రైవేటురంగాల్లో దళితులకు రిజర్వేషన్లు కల్పించాలి

ఏసీసీ, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా ఎస్సీ సబ్ ప్లాన్ చట్టం అమలుతోపాటు రాష్ట్ర జనాభా ఆధారంగా బడ్జెట్ కేటాయించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పోచన్న పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలో పలువురు నాయకులతో కలిసి మాట్లాడారు. ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులకు సబ్సిడీ నిధులను విడుదల చేసి నూతన దరఖాస్తులకు అవకాశం కల్పించాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

వసతిగృహ విద్యార్థులకు వైద్య పరీక్షలు

కోటపల్లి, న్యూస్‌టుడే: గిరిజన పోషణ మిత్ర కార్యక్రమంలో భాగంగా ఐటీడీఏ పీఓ ఖుష్బూ ఆదేశాల మేరకు బుధవారం కోటపల్లి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తహీనతతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులను గుర్తించి ఐరన్, ఫోలిక్‌యాసిడ్ మందు బిల్లలను అందించారు. వైద్య సిబ్బంది విజయ నిర్మల, సుధాకర్‌గౌడ్, ఉమ పాల్గొన్నారు.

నెన్నెలలో జోరుగా జూదం

నెన్నెల, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లోని మామిడి తోటల్లో యువకులు జోరుగా జూదం ఆడుతున్నారు. ఓ గ్రామానికి చెందిన వ్యక్తి జూదానికి బానిసై రూ.15 లక్షల అప్పులపాలై ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదవడం, గంగారం, మన్నెగూడెం, జెండా వెంకటాపూర్, కోనంపేట, జంగల్‌పేట, మైలారంలలో జూదం ఆడుతున్నారు. ఈ విషయంపై ఎస్సై ప్రసాద్‌ను వివరణ కోరగా దాడు చేస్తూ యువతకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత


నిర్మాణం కూల్చివేస్తున్న దృశ్యం

ఈనాడు స్పందనకు వందనం

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: మండలంలో కన్నాల గ్రామ శివారులో రెండు పడకల ఇళ్ల సమీపంలో నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఈ నెల 17వ తేదీన ఈనాడులో 'కబ్జాలకు తెగబడుతున్నారు..' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు బుధవారం పొక్లెయిన్‌తో రేకుల షెడ్డును నేలమట్టం చేశారు. ఆక్రమణలు చేపడితే కేసులు తప్పవని తహసీల్దార్ జ్యోత్స్న హెచ్చరించారు.

సాగులో యాజమాన్య పద్ధతులు అవసరం

హాజీపూర్, న్యూస్‌టుడే: పత్తి, వరి సాగులో సమయానుసారంగా యాజమాన్య పద్ధతులు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.శివకృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం హాజీపూర్ మండలంలోని రాపల్లి, టీకనపల్లి గ్రామాల్లో వరి, పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పత్తి పంటల్లో పిందె రాలటం, రసం పీల్చే పురుగులను గుర్తించారు. వీటితోపాటు గులాబీ రంగు పురుగు, కాయకుళ్లు తెగులు వంటి సమస్యలు ప్రబలే అవకాశం ఉందన్నారు. అధిక తేమ, బెట్టవంటి ప్రతికూల పరిస్థితుల్లో పూత, పిందె రాలటం జరుగుతుందన్నారు. వీటి నివారణకు అయిదు లీటర్ల నీటికి ఒక మి.లీ. ప్లానోఫిక్స్ కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో నుడిదోమ ఉనికిని గుర్తించామన్నారు. దీని నివారణకు ఆరుతడి పద్ధతిలో నీటిని అందించాలన్నారు. యూరియా వాడకం తగ్గించి, పాయలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారిని కల్పన, మండల వ్యవసాయధికారి కృష్ణ, శాస్త్రవేత్తలు డా.తిరుపతి, నాగరాజు, ఏఈవో ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: వరి, పత్తి పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడంతో అధిక దిగుబడులు సాధించుకోవడంతోపాటు పంటలను చీడపీడల నుంచి రక్షించుకోవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం సమన్వయ కర్త కోట శివరామకృష్ణ సూచించారు. మండలంలోని ఇటిక్యాల, జెండావెంకటాపూర్ గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. మంచిర్యాల సహాయ సంచాలకురాలు సురేఖ, శాస్త్రవేత్త నాగరాజు, మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణాధికారులు శ్రీనివాస్, గోవర్ధన్ పాల్గొన్నారు.

దేవయ్య అందరికీ ఆదర్శం: డీజీపీ

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పోలీసుశాఖలో పని చేసే సిబ్బంది ఎస్‌హెచ్‌ఓ దేవయ్యను ఆదర్శంగా తీసుకొని విధులు నిర్వహించాలని డీజీపీ జితేందర్ అన్నారు. ప్రజలకు సత్వర సేవలను అందించినందుకు రాష్ట్రవ్యాప్తంగా పది పోలీస్‌స్టేషన్లను ఎంపిక చేయగా రామగుండం కమిషనరేట్ పరిధిలో బెల్లంపల్లి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ మూడో స్థానంలో నిలిచిన విషయం పాఠకులకు విదితమే. బుధవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో బెల్లంపల్లి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ దేవయ్యకు డీజీపీ జితేందర్, అదనపు డీజీపీ మహేష్ భగవత్‌లు ప్రశంసాపత్రాన్ని అందించారు. ఆయనతోపాటు పని చేసిన సిబ్బందిని వారు అభినందించారు.


డీజీపీ జితేందర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్‌హెచ్‌ఓ దేవయ్య

జోనల్ స్థాయి యోగా పోటీలకు ఎంపిక

దండేపల్లి, న్యూస్‌టుడే: జోనల్‌స్థాయి యోగా పోటీలకు దండేపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శంకర్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.రవి తెలిపారు. ఈ నెల 24న మందమర్రిలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న ఎస్.హర్షవర్ధన్, టి.సృజన్(అండర్ 14 విభాగంలో), ఎన్.శ్రీనాథ్ (అండర్ 17లో) జోనల్‌స్థాయికి ఎంపికయ్యారు. వీరిని బుధవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

దొంగతనం కేసులో జైలు శిక్ష

వేములవాడ, న్యూస్‌టుడే: దొంగతనం కేసులో ఓ వ్యక్తికి కోర్టు జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ బుధవారం తెలిపారు. 23 ఆగస్టు 15న వేములవాడ పట్టణానికి చెందిన మొత్కుపల్లి ఎల్లయ్య షాప్‌లోని నగదు కౌంటర్‌లో నుంచి ఆదిలాబాద్ జిల్లా దండెపల్లి మండలంలోని లక్ష్మీకాంతపురం గ్రామానికి చెందిన కాశెట్టి వెంకటేశ్ రూ.50 వేలను చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో జడ్జి జ్యోతిర్మయి నిందితుడికి 18 నెలల కఠిన కారాగారంతోపాటు రూ.1,000 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోటపల్లి: కోటపల్లి ఆదర్శ పాఠశాలలో తొమ్మిది నుంచి ఇంటర్ తరగతుల వరకు గంటల ప్రాతిపదికన భౌతికశాస్త్రం పాఠ్యాంశం బోధించేందుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 27లోగా దరఖాస్తులు సమర్పించాలని ప్రిన్సిపల్ రాజశేఖర్ సూచించారు.